# పలుకవేమి నాదైవమా!

కాఫీ గ్లాసు చేత్తో పుచ్చుకుని వయ్యారాలు "పలుకవేమి నా దైవమా" అందిట ఒక ఇల్లాలు. "ఇంకా పళ్ళు తోవుకోలేదే దేవతా" అన్నాడట. ఆ ఇల్లాలి నిజభర్త. నిజదార సుతోదర పోషణార్థమై మంచం మీంచి లేవాలంటే అతనికి కీళ్ళనొప్పులా కాళ్ళనొప్పులా పిలవకుండానే వస్తాయి. "నోరు మంచిదైతే వూరు మంచిదవుతుంది. లెగండి స్వామీ" అందిట ఆ సన్నుతాంగి. ఆవిడ ఒకప్పుడు సన్నగా వుండేది. తరువాత్తర వాత లావెక్కిందింది. విచారభారంతో బరువెక్కిందింది. కాఫీగ్లాసు చేత్తో పుచ్చుకుని వయ్యారాలు పోతూందని తెలుసుకున్నామా-అవి ఆవిడ కాఫీ వయ్యారాలు (ఫస్ట్ కాఫీ ఆవిడే తాగుతుంది) నోరు మంచిదైతే వూరు మంచిదవుతుంది. ఫలానా టూత్ పేస్టు వాడండి అన్న వ్యాపార ప్రకటనకు సూపైయ్యేలా టూత్‌బ్రష్, పేస్టూ నాలిగ్గీసుకునే ముక్కా బుజంమీద తువ్వాలుతో ఆవిడ రోజూ మొగుడికి పళ్లు కడిగించాల్సిందే. "నాలిగ్గీసుకోడం మర్చిపోయినట్లున్నారు" అంటే "అబ్బే లేదే అంటాడతను." "ఏదీ నాలిక చూపించండి" అనగానే నోరు తెరుస్తాడతను. "అమ్మా మన్ను తినంగనే శిశువునో ఆ కొంటెనో వెర్రినో" అన్లేడతను. "కలయో వైష్ణవ మాయయో ఇతర సంకల్పార్థమో" అని తెల్లబోవనూ లేదా ఇంతి. కాని "మరోమారు నాలిగ్గీసుకోండిచాలు"అనితృప్తిగా అతడినోరుమూయిస్తుంది.

కాఫీలయాక "ఇవాళ గడ్డం గీసుకోమంటావా"—అని తన ముఖ సమస్యపై ఆవిడ తీర్పును అభిలషిస్తాడు. అబ్బే ! ఎందుకండీ రేపు ఆదివారమేగా సోమవారం ఉదయం చేసుకోండి చాలు అనో, ఆహా! అలా కాదు—దేవదాసులా వున్నారు చేసుకోండి అనో ఆవిడ తీర్పు యిచ్చిన మీదట అద్దంముందు కూలబడతాడు. ఆవిడోమాటు తొంగి చూస్తూ వుంటుంది. "పరధ్యాసలోపడి మీసం గీకేసుకోగల్రు" అని ఆవిడ ఆడే



హాస్యాలు వినపడుతూనే వుంటాయి. "హ్హా! ఏవిటీ - మీసమా.... చిన్నది చేయమంటావా?" ఆమె "వొద్దు, వున్న దున్నట్టుణ్నీండి"....

"దట్సాల్....అసలు మన మొహం ఎలా వుందీ ?" ఆమె- "మీ మొహాని కేవండి నిక్షేపరాయుళ్ళాగున్నారు" "అది కాదే మన మొహానికి కలరొచ్చినట్టు లేదూ" ఆమె "అది కలరనుకుంటున్నారా రామరామ, కిటికీ లోంచి ఎండొచ్చి మీ మొహాన్న పడుతూంది." "అది కాదు నా బాకిడీ కూడా రంగొచ్చినట్లు లేదూ" ఆమె "రక్తం పలచబడిందేమో. మనిషి కూడా పాలిపోయినట్టు కనిపిస్తున్నారు. పది రూపాయలు పారేసి డాక్టరు

కోమాటు చూసించగోరాదూ ?" "అబ్బ నేను నా సౌందర్యం గురించి మాట్లాడుతూంటే నువ్వు దాన్ని అనారోగ్యంలోకి దింపుతున్నావు?" ఆమె "మగాళ్ళకి అందచందాలేవిటి, ఆరోగ్యమే ముఖ్యం", "అబ్బ చూసుకో లేదు మాటల్లో గడ్డం తెగింది. వెధవ బ్లేడు" ఆమె "వుండండుండండి పటిక ముక్కతో రుద్దుదురుగాని" "మొగాళ్ళకి నిత్యము ఇదో తద్దినం పెట్టాడు భగవంతుడు. ఈ బాధపడలేకే గడ్డం పెంచేద్దావని చూస్తున్నాను" ఆమె "గడ్డాన్ని పట్టుకు పోషించవద్దా." "జనక మహారాజు, వశిష్ఠుడు, విశ్వామిత్రుడు, జార్జి బెర్నార్డ్‌షా, టాగోరు, మరేమో అరవిందయోగి, రామకృష్ణ పరమహంస వీళ్ళందరూ గడ్డాల్ని పెంచలేదా ? అబ్రహాం లింకన్, టాల్‌స్టాయ్, చెహోవ్, లెనిన్ యిలాంటి మహానుభావు లంతా గడ్డాలు పెంచారు యీ బాధపళ్ళేక". ఆమె ! అవ్వేం మాటలండీ, ఆడాళ్ళకు యింకెన్నెన్ని బాధలున్నాయి? మగాళ్ళకి అదో హ పేగా-అమాత్రానికే ప్రపంచం తలక్రిందులైనట్లు గాబరాపడిపోవాలా."

ఇలా సాగుతుంది కొందరి జీవనయాత్ర. వాళ్ళని పెళ్ళాం కొంగు చాటు మనుష్యులని అంతా వెక్కిరించే మాట నిజమే కాని తమ బరువు బాధ్యతలను యిలా అక్కలమీదో, చెల్లెళ్ళమీదో, వదినలమీదో, తల్లుల మీదో, పెళ్ళాలమీదో వేసి బ్రతికే వారిని అమాయకులని లోకం క్షమించి వదిలేస్తుంది. కాని చాలామంది పుణ్య పురుషులు ఈ కోవలోకి వస్తారు. ఆడది హాండ్ మైడ్‌లాగ వేలట్‌లాగ కొండకచో గురువులాగా అన్ని విషయాల్లోనూ పురుషునికి ఛాయలాగ వెన్నాడుతూ ఉత్తేజ పరుస్తూ వుండక పోతే జగన్నాథ రథచక్రాలు నడవ్వు. డ్రడ్జరీలో మటుకు ఆడదానికి ఆనందములేదనా—ఆవిడ ఫామిలీవే ఆవిడకు జగన్నాథుడిరథం. ఆ రథాన్ని లాగటంమటుకు సామాన్యమైన విషయం కాదు. నేను పైన చెప్పిన ఆవిడ మొగుడ్ని చంటిబిడ్డను సాకినట్లు సాగుతుంది. చొక్కా ఎప్పుడు మార్చాలో ఆవిడ చెప్పాలి. బుష్ షర్ట్‌కి కొలతలు ఆవిడ చెప్పి వదులుగా ఉండాలో శరీరాన్నిబట్టి వుండాలో టైలరుకి ఆవిడ సూచనలు ఇవ్వాలి. ఆవిడకు ఓ పేరంటానికి వెళ్ళడానికి వీలుండదు, పుట్టింటికి గాని, చుట్టాలింటికి గాని వెళ్ళడానికి వీలుండదు. పైకి కనపడే పితృస్వామ్యంలో అంతర్గర్భితంగా

మాతృస్వామ్యం యిలా విస్తరించి వుంటుంది. ఆడపెత్తనం, ఆడపెత్తనం అని అంతా లోకువకట్టి మాటలంటారు కాని మగ మహారాజులు విజయ వంతంగా జగన్నాథ రథ సారథ్యాన్ని నిర్వహించే సత్యభామలు దొరికి నప్పుడు అస్త్రసన్యాసం చేసి ఆ రథంమీదే పడుకుని నిద్రపోవడానికి యిష్ట పడతారు.

మేల్ డామినేషన్ యింతగా వున్న ఈ భూ ప్రపంచంలో ఆడవానికి వంటింటి డ్రడ్జరీని తగ్గించేయాలంటే ఏదైనా సింపుల్ నివారణోపాయం బెణుకు మంత్రం, తేలు మంత్రం, పాముకాటు మంత్రం లాంటిది వుందా అంటే కనుచూపుమేరలో అవిలేవు. పైగా అమాయకులు, అప్రయోజకులు నోట్లో వేలుపెడితే కొరకలేని పురుషుల వలన యింతులకు మేల్బంతులకు కుటుంబ డ్రడ్జరీ అధికాధిక మవుతున్నదే కాని తగ్గటంలేదు. మోడ్రన్ ఆడది ఏమంటున్నదంటే నా మొగుడు నేను పిలవగానే "ప్రజంట్ సార్" అనేట్లుంటే చాలనుకుంటోంది. క్లబ్బుల కెళ్ళకుండా, పేకాడకుండా, తాక్కుండా, స్నేహితుల్తో తిరక్కుండా చాపమీద కుక్కలాగ తనపాదాల చెంత చోటు చేసుకుంటే చాలని ఆశిస్తోంది. తనతో షికార్లు సినిమాలకు వస్తే చాలని సంతోషించే స్థితిలో వుంది. పనిమనిషి దగ్గర్నుంచి పరాయి స్త్రీ వరకు కన్నెత్తిచూడని వాడై వుండాలని కోరుకుంటోంది. కాని తను మాత్రం సంప్రదాయానికి కట్టుబడి పవిత్ర భారత స్త్రీమూర్తి ఫొటోకి అస లుకి సరియైన నకలుగా వుండాలని కోరుకుంటుంది.

పవిత్ర భారతదేశం పవిత్ర భారతీయ స్త్రీ మూర్తి అనగానే నాకు వళ్ళంతా తేళ్లూ జెర్రులూ ప్రాకినట్టు కంపరమెత్తిపోతుంది ఇహలోకంలో ఏ దేశమూ పవిత్రం కానట్టూ ఏ దేశంలోని స్త్రీలూ పవిత్రులు కానట్టూ కోసే కోతలు యీ దేశంలో యింకా ఎంతకాలం దేశభక్తిగా, చలామణి అవుతాయో నాకర్థం కావటంలేదు. భారత ప్రభుత్వం తెలిసో తెలియకో ఫామిలీ ప్లానింగ్ ద్వారా "సెక్స్ ఫ్రీడం"ని బ్లాంక్ చెక్కులా స్త్రీలకు

ప్రసాదించింది. పురుషల దౌర్జన్యాలన్నిటికీ సమాధానం చెప్పగల ఒక మహాస్త్రాన్ని గవర్నెమెంటు స్త్రీలకు యిచ్చింది. రేపటిప్రపంచంలో తనకు బిడ్డ అవసరముకాదా అని నిర్ణయించుకునేది స్త్రీ. పెళ్ళి చేసుకోవటమా ఉద్యోగం చేయటమా అని నిర్ణయించుకునేది స్త్రీ. గర్భధారణమనే శాపాన్నుండి విముక్తి స్త్రీకి లభించినపుడు యిప్పటి వ్యవస్థా స్వరూల్నిపా తల క్రిందుగా చేయగల వజ్రాయుధం ఆవిడ చేతిలో వుంటుంది. ట్రెడిషనల్ కన్సర్వేటిజంతో కుంచించుకుపోయినవైవాహిక వ్యవస్థపై వజ్రాయుధాన్ని ప్రయోగించగలదు రేపటి స్త్రీ. ఇప్పుడు "పలుకవేమి నాదైవమా" అంటున్నారు ఆడాళ్ళు. మరికొందరు "పిలచిన బిగువటరా ఔరౌర!"అంటున్నారు రేపటి స్త్రీ అలాఅనదు. ఆవిడ చేతిలో గవర్మెంటా ఫిండియావారి బ్యాంక్ చెక్కుంది. టేక్కేర్!